## క్లుప్తంగా

### సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి


మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీ నరసింహా

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహా వీఆర్వోలకు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమావేశమయ్యారు. ప్రజలు ఏ సమస్యపై వచ్చినా పెండింగ్‌లో పెట్టకుండా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపాలన్నారు.

### తాగునీటి కష్టాలను తీర్చండి

పరిగి: మండల కేంద్రంలోని ప్రశాంతినగర్‌లో కొద్ది రోజులుగా నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ రెడ్డెప్పను స్థానికులు కోరారు. జయమంగళి నది సమీపంలోని బోర్ల నుంచి ప్రశాంతి నగర్‌కు పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా అవుతున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇటీవల పైప్‌లైన్ జామ్ కావడంతో నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. దీతో నీటి ఇబ్బందులతో సతమతమవుతున్నామని, బిందెడు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నామన్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రశాంతినగర్ వాసులకు నీటి సమస్య తీర్చాలని కోరారు. ఎంపీడీఓ స్పందిస్తూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఈఈ శివకుమార్‌నాయక్

పెనుకొండ రూరల్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ ఈఈ శివకుమార్ సూచించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఏవై 2.0 ద్వారా 1500 గృహాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఒక్కొక్కరికీ రూ.2.50 లక్షలు మంజూరవుతుందన్నారు. స్థలం ఉన్న వారు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఏఈ శ్రీనాథ్, సీఎల్‌టీసీ రఘునాథ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

### సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి


స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రొళ్ల: చౌకధాన్యపు డిపో ద్వారా వినియోగదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎఫ్‌పీ షాపుల డీలర్లు, సచివాలయం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొత్తం 26 ఎఫ్‌పీ షాపుల పరిధిలో 12,306 స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చాయని, అలాగే కొత్తగా బయోమెట్రిక్ మిషన్లు కూడా వచ్చినట్లు చెప్పారు. కొత్తగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు.

### అసెంబ్లీలో తీర్మానం ఆమోదించండి


మాట్లాడుతున్న బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ

పెనుకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లాలో దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఇతర వెనుకబడిన పేదలకు ఆపన్న హస్తం అందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌కు అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపాలని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్షలాది మంది అభాగ్యులకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ఆర్డీటీకి కేంద్రం ఎఫ్‌సీఏఆర్ రెన్యూవల్ చేయకపోవడం దారుణమన్నారు. దీనివల్ల సంస్థ సేవలు నిలిచిపోయే ప్రమాదముందన్నారు. దీనిపై ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు బాబు, రవి పాల్గొన్నారు.

## చెరువు కాదు .. రోడ్డే


చెరువును తలపిస్తున్న గొబ్బరంపల్లిలోని రహదారి

రొద్దం: మండల పరిధిలోని గొబ్బరంపల్లి గ్రామంలో చిన్నపాటి వర్షానికే గ్రామంలో రొడ్డలన్నీ జలమయమవుతున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు మొత్తం చెరువును తలపిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. సిమెంట్ రోడ్డు వేసిన అధికారులు పిల్లకాలువలు నిర్మించి ప్రధాన కాలువలు నిర్మించకపోవడంతోరోడ్డుపై వర్షపు నీరు నిలువ ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దోమలు అభివృద్ధి చెంది రోగాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఇప్పటికైనా డ్రైనేజీ కాలువలు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పంటకు తెగులు .. రైతుకు దిగులు

మడకశిరరూరల్: మండలంలో ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ పంటకు వ్యాపిస్తున్న తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ఎండుముఖం పట్టిన వేరుశనగ పంట జీవంపోసుకుని కళకళలాడుతున్నా పంటకు ఆకుముడత, అగ్గితెగుళ్లు, తదితర తెగుళ్లు వ్యాపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూతదశలోనే తెగుళ్లను నివారించకపోతే పంటచేతికందే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను పరిశీలించి తెగుళ్ల నివారణకు అన్నదాతలకు సూచనలు, సలహాలు అందించాల్సిన అవసరం ఉంది.


తెగులు సోకిన వేరుశనగ పంట

## ముక్కు మూసుకోవాల్సిందే..


రోడ్డు మధ్యలో ఉన్న మురుగు కాలువ

పావగడ: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన ప్రధాన రోడ్డు గుంతలు పడి నడవడానికే వీలు లేని విధంగా అధ్వానంగా మారింది. సరైన చరండి వ్యవస్థ లేక పోవడంతో ఇళ్లలోని మల మూత్రాలు సైతం రోడ్డు మీద పారుతున్నాయి. రోడ్డు మధ్యలోనే మురుగు ఉండడంతో నడిచేవారు కూడా దుర్వాసన తట్టుకోలేక ముక్కు మూసుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డు కౌన్సిలర్ మాలిన్ తాజ్‌కు రోడ్డు సమస్య ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే ఆ రోడ్డును మరమ్మతులు చేసి చరండి వ్యవస్థ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ రామకృష్ణ, శిక్షణలో పాల్గొన్న కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు

అమరాపురం: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని పెనుకొండ డీఎల్‌డీఓ రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశమై మాట్లాడారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు తదితర వాటిని సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామరావు, ఈఓఆర్డీ సుధాకర్, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

గుడిబండ: పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీడీఓ కేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతిపై కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎల్‌పీఓ రామకృష్ణయ్య మాట్లాడుతూ పీ4 కార్యక్రమం ద్వారా పేదలకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా వారి భవిష్యత్తుకు పటిష్టమైన పునాది వేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం నుంచి పేద కుటుంబాలకు అందాల్సిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో? లేదో చూసుకోవాలన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న సచివాలయ ఉద్యోగులు

గోరంట్ల: సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని బుధవారం మండలంలోని సచివాలయ ఉద్యోగులు తహసీల్దార్ మారుతీకి వినతిపత్రమిచ్చారు. ఇంటింటా తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని కోరారు. కార్యాలయ పనివేళలతో సంబంధం లేకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, సెలవు దినాల్లో బలవంతంగా విధులు చేయించడం సరికాదన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ ఉద్యోగులకు తెలియజేశారు.

## భూసేకరణ చట్టాన్ని అమలు చేయండి


ఏఓ గిరిధర్‌నాయక్ వినతిపత్రం ఇస్తున్న రైతులు

పెనుకొండ రూరల్: భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని మడకశిర మండలానికి చెందిన పలువురు రైతులు బుధవారం ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓ గిరిధర్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మడకశిర మండలంలోని ఆర్.అనంతపురం, గౌడనహళ్లి, చత్రం, ఈదలేడ్డి పంచాయతీ గ్రామాల్లో 2014లో నాటి ప్రభుత్వం పరిశ్రమల కోసమని 1585 ఎకరాల భూమి సేకరించిందన్నారు. పదేళ్లు గడచినా ఎలాంటి పరిశ్రమలు రాలేదన్నారు. 1బీలలో తమ పేర్లను తొలగించడంతో భూముల ద్వారా రైతులుకు అందాల్సిన పథకాలు అందడంలేదన్నారు. వెంటనే భూసేకరణ చట్టాన్ని అమలు చేసి తమకు ఉపాధి కల్పించాలన్నారు. రైతులు కిష్టప్ప, లోకేష్, మాధవరెడ్డి, మూర్తి, రాజు, ఉగ్రప్ప, నాగేంద్రప్ప, రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావాన్ని అలవర్చుకోవాలి


కళాశాల ఆవరణలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ స్థాపన దినోత్సవాన్ని జరుపుకున్నారు. సరోజినీదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. యువత చేతుల్లోనే భారత భవిష్యత్తు ఉందన్నారు. అనంతరం కళాశాల హాస్టల్ ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటి నీరు పోశారు. మొక్కల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పెంచిన మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరీపై ఉందన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీఓలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ మంజుల, అధ్యాపకులు డాక్టర్లు సుమతి, హరిబాబు, మోహన్‌రావు, గిరి, రాఘవేంద్ర, విజయ్, ప్రశాంతి, కశ్యప్, పీడీ రమేష్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

**నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి**

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ సేవా పథకంలో చేరి నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని కోరారు. వికసిత భారత్ 2047 సాధనలో యువత ముఖ్య పాత్ర పోషించాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. పీఓ ప్రతాప్, ఐక్యూ కోఆర్డినేటర్ యశోదారాణి, హరీష్‌బాబు, రామన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పీఓ శివణ్ణల నేతృత్వంలో ఎన్‌ఎస్‌ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

### 29వ వార్డులో 'స్వచ్ఛతా హీ సేవ'


ఇందిరాపార్కులో చెత్తా చెదారాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని 29 వార్డులోని ఇందిరమ్మ పార్కులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రోషన్ అలీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కౌన్సిలర్ రోషన్ అలీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, సచివాలయ సెక్రటరీలు రమేష్, కుమార్, మేస్త్రి నవీన్, వార్డు ప్రజలు యువత పాల్గొన్నారు.

### 13 పంచాయతీలకు నిధుల మంజూరు

అగళి: మండలంలోని 13 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.68,65,572 మంజూరైనట్లు ఈఓఆర్డీ పద్మ తెలిపారు. అగళికి రూ, 9,27,775 , హెచ్‌డీ హళ్లి రూ, 4,98,122, హళ్లికేర రూ.5,11,133, ఇనగలూరు రూ.6,45,514, ఇరిగేపల్లి రూ. 4,37,693 , కోడిపల్లి రూ,6,00,699, కోమరేపల్లి రూ.4,11,776, మధూడి రూ.6,42,324 మంజూరైనట్లు పేర్కొన్నారు. అలాగే నరసబుంది పంచాయతీకి రూ.3,83,892, పీ బ్యాడగేర రూ.5,62,111, ఆర్‌జీ పల్లి రూ.6,00,070, రామనపల్లి రూ,3,09,588, రావుడి రూ.3,34,875 నిధులు పంచాయతీలకు ఖాతాలకు జమ చేసినట్లు వివరించారు. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ తదితర అత్యవసర పనులకు నిధులు వినియోగించనున్నట్లు ఈఓఆర్డీ పేర్కొన్నారు.

### బియ్యం కార్డుల పంపిణీ

అమరాపురం: మండల పరిధిలోని మద్దన కుంట గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను సచివాలయ అధికారులు పంపిణీ చేశారు. పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు వచ్చాయని, వాటిని లబ్ధిదారులు తీసుకోవాలని సూచించారు.

### మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం గ్రామంలో కల్లుమర్రి పాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ లిఖిత మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామ్‌ప్రసాద్, సరస్వతమ్మ, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### వార్షిక ప్రణాళిక పై అవగాహన

అమరాపురం: గ్రామాల్లోని మహిళా సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2025 -26 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏడీ అమర్నాథ్ తెలిపారు. వెలుగు, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం అమరాపురంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమర్నాథ్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా పాడి ఆవులు, మేకలు, గొర్రెలు తదితర వాటిని కొనుగోలు చేసి ఇస్తామన్నారు. దీనివల్ల పశు సంపద పెరగడంతో పాటు ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. మండలంలోని 1657 మందిని గుర్తించి వారికి రోజూ వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏపీఎం ముత్యాలప్ప , సీసీలు, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

### మూడు వాహనాల ఢీ

పెనుకొండ రూరల్: మూడు వాహనాలు ఢీ కొన సంఘటన 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. కియా పోలీసుల వివరాలమేరకు.. అనంతపురం వైపు నుంచి అరటి పండ్లతో బెంగళూరు వెళ్తున్న బొలెరో వాహన టైరు గుట్టూరు సమీపంలోకి రాగానే పేలింది. అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని పక్కనే ఉన్న మరో రహదారిపైకి బొలెరో దూసుకెళ్లింది. అటుగా బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న బొలెరో వాహన డ్రైవర్ వేగాన్ని నియంత్రించాడు. దీంతో ఆ వెనుకనే వస్తున్న ఐచర్ ముందు వెళ్తున్న బొలెరోను ఢీ కొంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

### మైలారలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లిలో వెలసిన దళిత కులస్తుల ఆరాధ్య దైవం మైలారలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ పూజారి హనుమంతరాయ తెలిపారు. ఈమేరకు గ్రామస్తులతో కలిసి స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఆలయ ఆవరణలో ఉన్న హుండీతో పాటు గుడిలోని ఐదు గంటలు ఎత్తుకెళ్లారన్నారు. హుండీలో రూ.లక్ష వరకూ ఉంటుందన్నారు. అర్చకుడు, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నవరాత్రి శోభ



పెనుకొండ: గాయత్రీదేవిగా మహేశ్వరి


అమరాపురం: ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి


చంద్రఘంట రూపంలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి


మడకశిర: తాడినాగమ్మగా చంద్రమౌళేశ్వరస్వామి


అలంకరణలో చోళస ముద్రం చౌడేశ్వరిదేవి


రత్నగిరికోటలో భస్మాలంకరణలో కాళికాంబాదేవి


కామాక్షిదేవిగా ముదిరెడ్డిపల్లి చౌడేశ్వరీదేవి


అన్నపూర్ణేశ్వరిగా దేమకేతేపల్లి చౌడేశ్వరీదేవి


పరిగి: అన్నపూర్ణాదేవిగా సప్తమాతృక అమ్మవారు


పావగడ: సింధూర అలంకరణలో జ్యేష్ఠాదేవి


పెనుకొండ: వారాహీమాత అలంకరణలో వాసవీమాత


లేపాక్షి: అన్నపూర్ణేశ్వరిగా దుర్గాదేవి

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలకు బుధవారం ఉదయం నుంచే భక్తులు క్యూకట్టారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.


గోరంట్ల: ద్రాక్షాయణిగా కన్యకా పరమేశ్వరి


సోమందేపల్లి: అన్నపూర్ణేశ్వరిగా చౌడేశ్వరీదేవి


మడకశిర: బ్రహ్మచారిణిగా గాయత్రీమాత


అమరాపురం: కుమారీదేవి అలంకరణలో వాసవీమాత

### ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



పావగడ: శరన్నవరాత్రుల వేడుకలను పురస్కరించుకుని వివిధ ఆలయాల్లో విభిన్న రీతుల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం ప్రధాన అర్చక దంపతులు నరసింహగోపాల్, కవిత ఇంట్లో దేవుళ్లతో కొలువుదీర్చిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంటోంది. వివిధ రకాల సాంప్రదాయ, పురాణ, జానపద బొమ్మలను సేకరించి వాటితో బొమ్మల కొలువును తీర్చిదిద్దుతున్నట్లు వారు పేర్కొన్నారు.